లండన్‌లో అంబేద్కర్ మ్యూజియానికి తెలంగాణ జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్సీ కవిత

అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ ప్రగతి

- రాజ్యాంగ నిర్మాతకు గౌరవం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- లండన్ నగరంలో అంబేద్కర్ మ్యూజియం సందర్శన

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మాత్రమే నెరవేరుస్తున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణలో అనేక పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. లండన్ పర్యటనలో ఉన్న ఆమె శుక్రవారం అక్కడి అంబేద్కర్ మ్యూజియాన్ని సందర్శించారు. ఫెడరేషన్ ఆఫ్ అంబేద్కర్ అండ్ బుద్ధిస్ట్ అసోసియేషన్ యూకే సంయుక్త కార్యదర్శి శ్యామ్‌కుమార్ ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ నాయకత్వంలో రూపొందించిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని అన్నారు. తనకు అంబేద్కర్ ఆదర్శమని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించడమే కాకుండా కొత్తగా నిర్మించిన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టిందని, అంబేద్కర్ స్ఫూర్తితో సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తాను 48 గంటలపాటు నిరాహార దీక్ష చేశానని గుర్తుచేశారు.

మహిళా బిల్లు.. పోస్ట్ డేటెడ్ చెక్

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించలేదని కవిత విమర్శించారు. ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ల కోసం పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. కార్యక్రమంలో టీఎస్ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మేడె రాజీవ్ సాగర్, రాష్ట్ర ఫిలిండెవలప్‌మెం ట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం, భారత్ జాగృతి ప్రెసిడెంట్ సుమన్ బాలుమూరి, భారత్ ఎన్నారై యూకే అధ్యక్షుడు అ శోక్ గౌడ్, భారత్ జాగృతి స్టేట్ యూత్ ప్రెసిడెంట్ కోరబోయిన విజయ్, రాష్ట్ర కార్యదర్శి రోహిత్‌రావు, యూరోప్ ప్రెసిడెంట్ దన్నమనేని సంపత్, కార్యదర్శి కిశోర్ మునుగాల, జనరల్ సెక్రెటరీ వంశీ తులసి, సంతోష్ ఆకు ల, నవీన్‌రెడ్డి, రత్నాకర్ కడుదుల, చాడ సృజన్ రెడ్డి, సతీశ్‌రెడ్డి గొట్టిముక్కుల, రమేశ్ ఇస్సంపల్లి తదితరులు పాల్గొన్నారు.

సమ్మిళిత దేశాభివృద్ధి కోసం..

అంతర్జాతీయ మేధావి అంబేద్కర్ దళితుల కోసమే కాకుండా మహిళల హక్కుల కోసం కూడా కృషి చేశారని కవిత పేర్కొన్నారు. పలు దేశాల్లో ఇప్పటికీ ఓటు హక్కు కోసం మహిళలు పోరాటం చేస్తున్నారని, కానీ భారత్‌లో అంబేద్కర్, నెహ్రూ వంటి వారివల్ల రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటి నుంచే మహిళలకు ఓటు హక్కు లభించిందని తెలిపారు. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం 15 శాతమే ఉండటం విచారకరమని ఆవేదన వ్యక్తంచేశారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని మహిళా రిజర్వేషన్ల కోసం తాను ఉద్యమించానని తెలిపారు. సమ్మిళిత దేశ నిర్మాణం కోసం అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

సాగు కళకళ .. రైతు జేబు గలగల

- వ్యవసాయాన్ని పండుగ చేసి చూపిన కేసీఆర్
- తెలంగాణ వ్యవసాయ రంగంపై చెరగని ముద్ర
- రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా పథకాలు
- సాగు విస్తీర్ణం 81%, పంట ఉత్పత్తి 145% పెంపు
- ప్రభుత్వ పథకాలతో వెల్లివిరిసిన ఐదు విప్లవాలు
- పదేండ్ల వ్యవసాయ ప్రగతి నివేదికలో వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): పదేండ్లలో తెలంగాణ వ్యవసాయం పండుగైంది. రైతులను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేసిన రైతు సంక్షేమ పథకాలు సత్ఫలితాలనిచ్చాయి. ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రైతుబీమా, ధాన్యం కొనుగోలు, రుణమాఫీ, ఉచిత చేప పిల్లల పంపిణీ, గొర్రెల పంపిణీ వంటి పథకాలతో తెలంగాణలో వ్యవసాయరంగం రూపురేఖలు మారిపోయాయి. స్వరాష్ట్రంలో సాగు విస్తీర్ణం 81%, పంట ఉత్పత్తులు 145% పెరగడం పదేండ్ల ప్రగతికి అద్దంపడుతున్నది. దశాబ్ది కాలంలో తెలంగాణ వ్యవసాయరంగం సాధించిన ప్రగతిపై ఆ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక నివేదిక విడుదల చేశారు. ఈ నివేదికలోని ముఖ్యాంశాలు

తెలంగాణ వ్యవసాయరంగంలో సాధించిన ప్రగతి

అంశం	2014-15	2022-23	పెరుగుదల శాతం
పంటల సాగు విస్తీర్ణం	131	238	81.60
నీటి పారకం విస్తీర్ణం	62	135	117.70
వ్యవసాయ ఉత్పత్తుల ఉత్పత్తి	154	378	145.45
దేశ సాగులో తెలంగాణ వాటా	2.28%	5.35%	134.65

(సాగు విస్తీర్ణం-లక్షల ఎకరాల్లో, ఉత్పత్తి-లక్షల టన్నుల్లో)

పంటలవారీగా సాగు విస్తీర్ణం, ఉత్పత్తి వివరాలు

పంట రకం	2014-15		2022-23	
	సాగు	ఉత్పత్తి	సాగు	ఉత్పత్తి
వరి	34.98	68.17	121.43	261.30
మొక్కజొన్న	17.08	23.08	12.70	30.44
పత్తి	41.83	18.45	50.00	27.74
వేరుశనగ	3.82	2.95	2.64	2.50
మిరప	1.81	2.53	2.74	5.32
కంది	5.45	1.09	5.65	2.06
ఇతర పంటలు	20.84	31.28	37.02	47.20
మొత్తం	129.04	150.16	232.58	378.39

(సాగు విస్తీర్ణం-లక్షల ఎకరాల్లో, ఉత్పత్తి-లక్షల టన్నుల్లో)

సాగునీటి ప్రాజెక్టులు

సాగునీటి గోస తీర్చి వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్.. తొలుత 'కాళేశ్వరం ప్రాజెక్ట్'ను పూర్తిచేశారు. దీనికితోడు దక్షిణ తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును చేపట్టారు. ఈ రెండు ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయరంగానికి జీవనాడిగా నిలిచాయి. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, చెరువులను బాగు చేశారు. తద్వారా రాష్ట్రంలో సాగునీటి గోస తీరడంతోపాటు భూగర్భ జలాలు పెరిగాయి.

రైతుబంధు సాయం 72,815 కోట్లు

రైతులకు పెట్టుబడి కష్టాలు తీర్చాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ 2018లో రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. ఏటా 65 నుంచి 69 లక్షల మంది రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయం అందుతున్నది. ఈ పథకం కింద ఇప్పటివరకు రూ.72,815 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయింది.

లక్షకు పైగా కుటుంబాలను కాపాడిన రైతుబీమా

కారణం ఏదైనా సరే రైతు మరణిస్తే, ఆ రైతు కుటుంబం రోడ్డున పడొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని అమలు చేస్తున్నది. మరణించిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నది. ఈ పథకం కింద ఇప్పటివరకు 1,11,154 రైతు కుటుంబాలకు రూ.5,566 కోట్లు అందించి ఆర్థికంగా అండగా నిలిచింది.

ఉచిత విద్యుత్తుకు ఏటా 12 వేల కోట్లు

వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అందించేందుకు ప్రభుత్వం ఏటా సుమారు రూ.12 వేల కోట్లు వెచ్చిస్తున్నది. ఇంత భారీ మొత్తంలో ఖర్చు చేస్తూ 24 గంటలపాటు నాణ్యమైన ఉచిత విద్యుత్తు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 8.47 కొత్త వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య 27.49 లక్షలకు చేరింది.

రుణమాఫీ మాట నిలుపుకున్న ప్రభుత్వం

రైతులను రుణవిముక్తి చేయాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ పంట రుణాల మాఫీకి శ్రీకారం చుట్టారు. 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రూ.లక్ష రుణం గల 40.74 లక్షల మంది రైతులకు చెందిన రూ.17,351 కోట్ల రుణాలను ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేసింది. 2018లో మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి విడతలో 5.41 లక్షల మంది రైతులకు చెందిన రూ.1,198 కోట్ల రుణాలను మాఫీ చేసింది. రెండో విడతలో రుణమాఫీ కోసం రూ.18,242 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే 22.46 లక్షల మంది రైతులకు చెందిన రూ.12,617 కోట్ల రుణాలను మాఫీ చేసింది. ప్రస్తుతం రుణమాఫీ ప్రక్రియ జరుగుతున్నది.

రైతు వేదికలకు 572 కోట్లు

రైతులను సంఘటితం చేయాలన్న ఉద్దేశంతో రైతు వేదికలను ప్రభుత్వం నిర్మించింది. ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ప్రతి క్లస్టర్‌కు ఒక ఏఈవోను నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.572 కోట్లతో 2,601 రైతు వేదికలను నిర్మించింది.

గ్లోబల్ సీడ్ హబ్

ప్రభుత్వం తీసుకున్న పారిశ్రామిక, వ్యవసాయ అనుకూల నిర్ణయాలతో తెలంగాణ రాష్ట్రం ప్రపంచ విత్తన హబ్‌గా మారింది.

- దేశానికి 60% విత్తనాలు రాష్ట్రం నుంచే సరఫరా అవుతున్నాయి.
- ప్రస్తుతం 1,500 గ్రామాల్లో విత్తనోత్పత్తి జరుగుతున్నది. సాగు విస్తీర్ణం 7 లక్షల ఎకరాలకు పెరిగింది.
- విత్తనోత్పత్తి పరిశ్రమల విలువ రూ.12 వేల కోట్లకు పెరిగింది.
- విత్తనోత్పత్తి రైతుల సంఖ్య 3.5 లక్షలకు పెరిగింది.

తెలంగాణ వ్యవసాయరంగంలో ఐదు విప్లవాలు

గ్రీన్ రివల్యూషన్: స్వరాష్ట్రంలో వరితోపాటు ఇతర పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం వరి సాగు విస్తీర్ణం 121 లక్షల ఎకరాలు కాగా ధాన్యం ఉత్పత్తి 262 లక్షల టన్నులకు పెరిగింది. 2015-16తో పోల్చితే ధాన్యం ఉత్పత్తి 400% పెరిగింది.

వైట్ రివల్యూషన్: రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను, పాడి రైతులను ప్రోత్సహించడంతో పాల ఉత్పత్తి భారీగా పెరిగింది. 2014-15లో 42 లక్షల టన్నుల పాలు ఉత్పత్తి కాగా ప్రస్తుతం 58 లక్షల టన్నులకు పెరిగి 38% పెరుగుదల నమోదైంది. పాడి రైతులకు దేశంలో మరెక్కడా లేని విధంగా లీటరుకు రూ.4 ప్రోత్సాహకం అందిస్తున్నది. ఈ మేరకు 300 కోట్లు రైతులకు ఇచ్చింది.

పింక్ రివల్యూషన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం పింక్ రివల్యూషన్ సృష్టించింది. గొర్రెల సంఖ్యలో తెలంగాణ దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 1.91 కోట్ల గొర్రెలు ఉన్నాయి. ఈ పథకంతో గొర్రెల సంఖ్య 48.51% పెరిగింది. 10.04 లక్షల టన్నుల మాంసం ఉత్పత్తితో దేశంలో 5వ స్థానంలో నిలిచింది.

బ్లూ రివల్యూషన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీతో రాష్ట్రంలో నీలి విప్లవం ఆవిష్కృతమైంది. చేపల ఉత్పత్తి 2.68 లక్షల టన్నుల నుంచి 3.90 లక్షల టన్నులకు పెరిగింది. చేపల ఉత్పత్తి విలువ రూ.2,637 కోట్ల నుంచి రూ.5,960 కోట్లకు పెరిగింది.

ఎల్లో రివల్యూషన్: ఆయిల్‌పాం సాగులో ఎల్లో విప్లవానికి దారితీసింది. మొత్తం 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు కోసం ప్రణాళిక రూపొందించింది. ఇప్పటివరకు 1.7 లక్షల ఎకరాల్లో సాగు పెరిగింది.

దేశ సాగుకు తెలంగాణే వేగుచుక్క

- ప్రపంచ వ్యవసాయ చర్చల్లో తెలంగాణ అంశం ఉంటుంది
- ప్రభుత్వం, రైతులు సాధించిన సంయుక్త విజయమిది
- వ్యవసాయంతో ఆర్థికంగా బలోపేతమైన పల్లెలు
- పదేండ్ల రాష్ట్ర వ్యవసాయ ప్రగతి నివేదికలో మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ పల్లా, కార్పొరేషన్ల చైర్మన్లు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): దేశ వ్యవసాయరంగానికి తెలంగాణ వ్యవసాయరంగం టార్చ్‌బేరర్‌గా మారిందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆచరిస్తుంటే, దేశం అనుసరిస్తున్నదని చెప్పారు. దేశ, విదేశాల్లో ఎక్కడ వ్యవసాయంపై చర్చ జరిగినా అందులో తెలంగాణ అంశం ఒకటిగా ఉంటుందని, ఇది తెలంగాణ ప్రభుత్వం, రైతులు సాధించిన విజయమని తెలిపారు. శుక్రవారం 'పదేండ్ల తెలంగాణ వ్యవసాయ ప్రగతి నివేదిక'ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమమే వ్యవసాయ ఇబ్బందుల ప్రాతిపదికన జరిగిందని వెల్లడించారు. ఇందుకు అనుగుణంగానే సీఎం కేసీఆర్ స్వరాష్ట్రంలో వ్యవసాయ, రైతుల ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఉచిత విద్యుత్తు, ప్రాజెక్టులు, రైతుబంధు, రైతుబీమా, పంటల కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ వ్యవసాయ అభివృద్ధిని ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆహార సంస్థలు గుర్తించాయని గుర్తుచేశారు. స్వామినాథన్ సైతం తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధిపై సంతోషం వ్యక్తం చేశారని, తాను కలలుగన్న వ్యవసాయాభివృద్ధి తెలంగాణలో జరుగుతున్నదని ఆయన పలు సందర్భాల్లో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలో సాగురంగం గ్యారంటీ ఉపాధిగా మారిందని తెలిపారు. రైతుబంధు పథకం ద్వారా రైతులకు రూ.73 వేల కోట్లు పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని స్పష్టం చేశారు. వివిధ వ్యవసాయ పథకాలకు రూ.4.5 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వమూ తెలంగాణేనని వెల్లడించారు. వ్యవసాయం అభివృద్ధి చెందటంతో రాష్ట్రంలోని గ్రామాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయని వివరించారు. సీఎం కేసీఆర్ అప్పగించిన వ్యవసాయశాఖ మంత్రి బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వర్తించానని, రైతులకు మేలు చేసేందుకు నిరంతరం కృషి చేశానని తెలిపారు. అధికారులు నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తించారని వెల్లడించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అభినందించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, విజయసింహారెడ్డి, కొండూరి రవీందర్‌రావు, మార గంగారెడ్డి, రజినీ, రాజా వరప్రసాద్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఉద్యానశాఖ డైరెక్టర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ: తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.1.33 లక్షల కోట్ల విలువైన 722.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగింది. 11,439.06 కోట్లతో ఇతర పంటల సేకరణ జరిగింది.

సాగు నీరు: ప్రపంచంలోనే అతిపెద్ద కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగు నీరు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా దక్షిణ తెలంగాణలో 6 జిల్లాల్లోని మరో 12.30 లక్షల ఎకరాలకు సాగు నీరు. రూ.5,349 కోట్లతో మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించి, 8.93 టీఎంసీల సామర్థ్యంతో 15.05 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ.

రుణ మాఫీ: తెలంగాణ ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు మొదటి విడతలో 35.31 లక్షల రైతుల రూ.16,144.10 కోట్లు రుణ మాఫీ. రెండవ విడతలో ఇప్పటి వరకు 22,98,039 రైతులకు చెందిన రూ.13 వేల కోట్ల రుణాలు మాఫీ. మిగిలిన రైతుల రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతున్నది. రెండు విడతలలో కలిపి 58.29 లక్షల రైతుల రూ.29,144.61 కోట్లు రుణమాఫీ.

వ్యవసాయ యాంత్రీకరణ: మొత్తం రూ.963.26 కోట్లతో, 6.66 లక్షల మంది రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ. తెలంగాణ ఏర్పడిన తర్వాత ట్రాక్టర్లపై రూ.273.5 కోట్ల రవాణా పన్ను మాఫీతో పాటు రాష్ట్రం ఏర్పడక ముందటి రూ.41.6 కోట్ల రవాణా పన్ను రద్దు.

గోడౌన్ల సామర్థ్యం: 2014-15లో 39.01 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటే ప్రస్తుతం 73.82 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు.

పంట నష్ట పరిహారం: పంట నష్ట పరిహారం కింద ఇప్పటివరకు మొత్తం రూ.1,794.76 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత.

ఆయిల్‌పామ్ సాగు: ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించటంలో భాగంగా ఆయిల్‌పామ్ మిషన్ కింద వచ్చే ఐదేండ్లలో 20 లక్షల ఎకరాల సాగు లక్ష్యం. ప్రస్తుతం రాష్ట్రంలో 1,94,954 ఎకరాలకు చేరిన ఆయిల్ పామ్ సాగు.

వ్యవసాయ విద్యకు ప్రోత్సాహం: తెలంగాణ ఏర్పడిన తర్వాత కొత్తగా 11 వ్యవసాయ, ఉద్యాన విద్య కళాశాలలు, పాలిటెక్నిక్ కాలేజీల ఏర్పాటు.

ఘనంగా తలసాని జన్మదిన వేడుకలు

కేవీఆర్ స్టేడియంలో భారీ కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు శుక్రవారం హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మంత్రి తలసానికి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌కు లేఖ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు సంతోష్, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, తాటికొండ రాజయ్య, మహిపాల్‌రెడ్డి, అబ్రహం తదితరులు ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో మంత్రి తలసాని జన్మదిన వేడుకలు సందడిగా జరిగాయి. తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మంత్రి కట్ చేశారు. ఈ వేడుకల్లో నగరంతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఏపీ నుంచి కూడా వచ్చి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ కళాకారుల నృత్య, డాక్యుమెంటరీ ప్రదర్శనలు అలరించాయి. లండన్‌లో బీఆర్ఎస్ ఎన్నారై యూకే యువజన నాయకుడు మధు యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. తనపై ఇంతటి అభిమానం, ప్రేమను చూపుతున్న అభిమానులు, కార్యకర్తలకు జన్మజన్మలా రుణపడి ఉంటానని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా కేవీఆర్ స్టేడియం ఆవరణలో మొక్కను నాటిన అనంతరం మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులకు ఎల్లవేళలా అన్నివిధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయా వేడుకల్లో సినీ నిర్మాతలు సీ కళ్యాణ్, చిన్నబాబు, ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దిల్ రాజు, కార్యదర్శి దామోదర ప్రసాద్, సీనియర్ నటులు రఘుబాబు, నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేశ్, బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, చిత్రపురి కాలనీ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని, కార్యదర్శి రాజు, ఫిలిం ఎంప్లాయిస్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, లండన్‌లో తెలంగాణ రాష్ట్ర చలనచిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కూర్మాచలం, టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి కొంరెడ్డి, హరికృష్ణ కొండపల్లి, అన్నారెడ్డి రాయడి, ధీరజ్‌రెడ్డి కడారి, సాయి మద్దినేని తదితరులు పాల్గొన్నారు.

మక్కాలో తెలంగాణ బిడ్డ మతసామరస్యం

- ముస్లిం వ్యక్తికి సాయం

దుబాయ్, అక్టోబర్ 6: తెలంగాణ స్వరాష్ట్రంలోనే కాదు.. విదేశాల్లోనూ గంగా జమున తెహజీబ్‌ను చాటగలం అని నిరూపించాడు మన తెలంగాణ బిడ్డ. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన ఖుర్షీద్ అహ్మద్ (46) దుబాయ్‌లో పనిచేస్తున్నారు. మక్కా సందర్శనకు వెళ్లి పాస్‌పోర్టు, సెల్‌ఫోన్ సహా అన్ని వస్తువులను పోగొట్టుకున్నారు. ఎవరూ సాయం అందించలేదు. ఈ విషయం తెలిసిన తెలంగాణ వాసి కొండాడం కృష్ణ.. మక్కా నుంచి జెద్దాకు రప్పించి, ఖుర్షీద్‌కు ఆహారం షెల్టర్ అందించారు. భారత రాయబార కార్యాలయానికి చేర్చి, భారత్‌కు చేరేలా ఎమర్జెన్సీ సర్టిఫికెట్ ఇప్పించారు. విమాన ఖర్చులకు కూడా సాయం చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన కృష్ణ ఈ సంఘటనపై మాట్లాడుతూ.. 'అల్లాను దర్శించుకొనేందుకు వచ్చిన ఖుర్షీద్‌కు సాయం చేస్తే, నా దేవుడు నాకు అంతకుమించిన బహుమతి ఇస్తాడు' అని చెప్పారు.

మెదక్ డీసీసీ అధ్యక్షుడు బీఆర్ఎస్‌లోకి

మొదటిపేజీ తరువాయి...

బలవంతంగా బయటకి పంపించిందని చెప్పారు. తిరుపతిరెడ్డితోపాటు బీఆర్ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం దక్కుతుందని అభయమిచ్చారు.

కాంగ్రెస్‌కు పుట్టగతులుండవు : కే తిరుపతిరెడ్డి

గత పదేండ్లుగా కాంగ్రెస్ పార్టీని మెదక్ జిల్లాలో బలోపేతం చేసేందుకు శాయశక్తుల కృషి చేశానని, తనకు టికెట్ ఇస్తానని చివరకు మోసం చేశారని తిరుపతిరెడ్డి మండిపడ్డారు. పార్టీలో కష్టపడి ప్రజలతో మమేకమైన నాయకులకు కాకుండా డబ్బు సంచులతో వచ్చిన పారాచూట్ నాయకులకే కాంగ్రెస్ టికెట్లు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేందుకు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు ప్రకటించారు. తనతోపాటు జిల్లాలోని అన్ని మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారని చెప్పారు. మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్‌లో చేరిన తరువాత ఆ పార్టీలో రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. ఏకంగా డీసీసీ అధ్యక్షులే రాజీనామాలు చేస్తున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నందికంటి శ్రీధర్ ఇప్పటికే బీఆర్ఎస్‌లో చేరగా, తాజాగా తిరుపతి రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు.

సింగరేణి తెలంగాణదే!

మొదటిపేజీ తరువాయి...

సమస్యలపై ఏర్పాటుచేసిన ప్రతి సమావేశంలోనూ తెలంగాణ ఇదే విషయాన్ని నొక్కి వక్కాణించింది. అటార్నీ జనరల్ కూడా తెలంగాణ వాదనే నిజమని తేల్చారు. సింగరేణి సంస్థకు తెలంగాణలోనే బొగ్గు గనులున్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో లేవని కేంద్ర బొగ్గు శాఖ నుంచి కూడా వివరాలు తీసుకున్నామని హోంశాఖ పేర్కొన్నది. ఒడిశాలోని నైనీలో మాత్రమే సింగరేణికి బొగ్గు గని ఉన్నదని, అదికూడా కోల్‌మైన్స్ (స్పెషల్ ప్రొవిజన్) యాక్ట్, 2015 ప్రకారం కేటాయించిందేనని, మిగతా గనులన్నీ తెలంగాణ భూభాగంలోనే ఉన్నాయని తెలిపింది.

ఆధునిక హంగులతో అనీస్-ఉల్-గుర్బా

- 20 కోట్లతో పునర్నిర్మాణం
- 600మంది అనాథలకు ఆశ్రయం
- నేడు ప్రారంభోత్సవం

హైదరాబాద్, అక్టోబర్6 (నమస్తే తెలంగాణ): నాంపల్లిలోని అత్యంత పురాతన అనీస్-ఉల్-గుర్బా అనాథ శరణాలయం తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో కొత్తగా రూపుదిద్దుకున్నది. అత్యాధునిక హంగులు, వసతులతో అందుబాటులోకి వచ్చింది. దాదాపు రూ.20 కోట్లకు పైగా నిధులతో 'అనీస్-ఉల్-గుర్బా' అనాథ శరణాలయం పునర్నిర్మాణం పూర్తి చేసుకోగా, శనివారంప్రారంభించనున్నారు. 1921లో సమాజసేవకులు మీర్ ఖాజా బద్రుద్దీన్ చిస్తీ